క్లుప్తంగా

టెన్త్ స్టడీ మెటీరియల్ పంపిణీ



విద్యార్థులకు స్టడీమెటీరియల్ అందజేస్తున్న ఉపాధ్యాయులు

బంగారుపాళెం: మండలంలోని తుంబపాళెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకుంటున్న 10వ తరగతి విద్యార్థులకు యూటీఎఫ్ శాఖ తయారు చేసిన స్టడీ మెటీరియల్‌ను ఆశాఖ మాజీ మండల అధ్యక్షులు మొగిలయ్య ఆధ్వర్యంలో ఉచితంగా అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు చిట్టెమ్మ మాట్లాడుతూ, విద్యార్థుల భవిష్యత్తును నిర్ణయించేది పదో తరగతి పబ్లిక్ పరీక్షలేనని గుర్తుచేశారు. విద్యార్థులు కష్టపడి చదివి మంచి మార్కులు సాధించాలన్నారు. పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. అందుకు ప్రణాళికాబద్ధంగా కష్టపడి చదవాల్సిన అవసరం ఉందన్నారు. యూటీఎఫ్ శాఖ వారు 10వ తరగతి విద్యార్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్ అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కోదండయాదవ్, ఉపాధ్యాయులు గంగాభవాని, బాబు, గిరిధర్ నాయుడు, అమరేంద్ర, రీటా, దామోధరం, నజ్మ పాల్గొన్నారు.

ఇంటి వద్దకే ఉచిత వైద్యం



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ చంద్రమహేష్

గుడిపాల: మండలంలోని 189 కొత్తపల్లె గ్రామంలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. వైద్యాధికారి చంద్రమహేష్ 60 మంది రోగులకు వైద్య పరీక్షలు చేశారు. అనంతరం ఉచితంగా మందులను పంపిణీ చేశారు. గర్భవతులు, బీపీ, మధుమేహ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించి తగు సూచనలను ఇచ్చారు. సీజనల్ వ్యాధులపై జాగ్రత్తలు పాటించాలన్నారు. గర్భిణులు క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఇంటి వద్ద మంచానికి పరిమితమైన రోగుల వద్దకు వెళ్లి వైద్యపరీక్షలు చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది విజయ, అనిత, మోహన, సునీత, ఎలవతి, భాగ్యవతి పాల్గొన్నారు.

నిర్లక్ష్యానికి నిదర్శనం



నిరుపయోగంగా మారిన ఈ-ఆటోలు

గుడిపాల: పర్యావరణ పరిరక్షణ, తడి,పొడి చెత్త నిర్వహణకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇంటింటా చెత్త సేకరణకు ఈ- ఆటోలను కొనుగోలు చేశారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్- పంచాయతీలు సంయుక్తంగా రూ.లక్షలు వెచ్చించి ఈ- ఆటోలను కొనుగోలు చేశారు. అయితే చిన్నపాటి మరమ్మతులు, సెన్సార్ ఏర్పాటులో జాప్యంతో ఈ ఆటోలు మూలనపడ్డాయి. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం, మరోవైపు అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దీంతో వాహనాలు తుప్పుపట్టి రూ.లక్షల ప్రజాధనం దుర్వినియోగం అవుతోంది.

బీఈడీ పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత

బంగారుపాళెం: స్థానిక శ్రీవేంకటేశ్వరా కళాశాలలో బీఈడీ కోర్సు నాలుగో సెమిస్టర్ పరీక్ష ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించినట్లు డైరెక్టర్ భాస్కర్‌రెడ్డి గురువారం తెలిపారు. 2023- 24 సంవత్సరానికి సంబంధించి ఎస్వీ యూనివర్శిటీ ఫలితాలను వెల్లడించినట్లు తెలిపారు. కళాశాలలో అందరూ ఉత్తీర్ణులయ్యారన్నారు. కళాశాలకు చెందిన సూర్యభాను, ఫర్హానా, షమీల్ ప్రథమ, ద్వితీయ, తృతీయ ర్యాంకులు సాధించినట్లు తెలిపారు. డైరెక్టర్‌తో పాటు ప్రిన్సిపల్ గోపినాథ్, ఇన్‌చార్జి ప్రిన్సిపల్ చిన్నబాబు, వైస్ ప్రిన్సిపాల్ షేక్ ఖదీర్, అధ్యాపకులు విద్యార్థులను అభినందించారు.

రైతులకు డిజిటల్ గుర్తింపు కార్డులు

తవణంపల్లె: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ప్రతి రైతుకూ ఒక విశిష్ట గుర్తింపు సంఖ్య(కార్డు) ఇవ్వనున్నట్లు వ్యవసాయాధికారి జి.ప్రవీణ్ తెలిపారు. ప్రతి రైతు రైతు సేవా కేంద్రంలో గ్రామ వ్యవసాయ సహాయకులచే ఫార్మర్ రిజిస్ట్రీ పోర్టల్‌లో రైతు వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. డిజిటల్ గుర్తింపు కార్డు ఉన్నవారికే పంటల బీమా, పీఎం కిసాన్ యోజన, పంట నష్ట పరిహారం, అన్నదాత సుఖీభవ, వ్యవసాయ యంత్ర పరికరాలపై రాయితీ వర్తిస్తాయని వెల్లడించారు. ఈ నెల 28వ తేదీ లోపల రైతులు గ్రామ వ్యవసాయ సహాయకులకు సహకరించి వెంటనే ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేసుకోవాలని లేనిచో ప్రభుత్వం అందించే పథకాల ప్రయోజనాలు పొందే అవకాశం కోల్పోతారని తెలిపారు.

సేవకు అభినందన

కార్వేటినగరం: జాతీయ సమైక్య క్యాంపు 2025లో పాల్గొని ఉత్తమ సేవలు అందించిన ఎన్ఎస్ఎస్ విద్యార్థిని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయులురెడ్డి అభినందించారు. కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రిన్సిపాల్ మాట్లాడారు. విద్యార్థుల్లో సేవా దృక్పథాన్ని పెంపొందించేందుకు ఎన్ఎస్ఎస్ క్యాంపులు దోహదపడతాయన్నారు. అనంతరం రవికుమార్‌ను శాలువ కప్పి ఘనంగా సన్మానించారు.

చిత్తూరు పాత బస్టాండు (ఫైల్)



చిత్తూరు పాత బస్టాండు తాజా చిత్రం



అభివృద్ధి చేయండి..

మమ్మల్ని వీధిన పడేయకండి

చిత్తూరు అర్బన్/ కార్పొరేషన్: చిత్తూరు పాత బస్టాండులో వ్యాపారులను ఇబ్బంది పెడుతూ పాలకులు, అధికారులు ఏకపక్షంగా వ్యవహరిస్తుండడంపై విమర్శలు వస్తున్నాయి. మార్కెట్ రేటు చెల్లించి, ప్రభుత్వం నుంచి ఇక్కడున్న స్థలాలకు పట్టాలు పొందితే.. ఉన్న ఫలంగా బయటకు వెళ్లిపోవాలని చెప్పడం భావ్యం కాదంటున్నారు. 50 ఏళ్లకు పైగా పాత బస్టాండులో వ్యాపారాలు చేసుకుంటున్న తమను బయటకు వెళ్లిపోవాలని ఆదేశిస్తే.. కుటుంబాలతో కలిసి రోడ్డున పడాల్సిందేనంటున్నారు. బస్టాండును పునఃనిర్మించడానికి, అభివృద్ధికి తప్పకుండా సహకరిస్తామని వ్యాపారులు చెబుతున్నారు. అయితే అభివృద్ధి పేరుతో తమ కడుపులు కొట్టద్దని అభ్యర్థిస్తున్నారు. వ్యాపారుల ఆవేదనను అర్థం చేసుకున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శుక్రవారం పాత బస్టాండులో నిరసన కార్యక్రమానికి పిలుపునిచ్చింది. వ్యాపారులంతా స్వచ్ఛందంగా ముందుకొచ్చి నిరసనలో పాల్గొనాలని ఆ పార్టీ నేతలు కోరారు.

వ్యాపారుల స్థలంపై పెత్తనం ఏంటి?



అభివృద్ధి, బస్టాండు పునర్నిర్మాణానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకం కాదు. అసలు పాత బస్టాండును ఎవరు మూయించారు..? ఇంకా బస్టాండు ఎందుకు కట్టలేదో కూటమి నేతలు సమాధానం చెప్పాలి. 50 ఏళ్ల క్రితం అప్పటి బస్టాండులో స్థలాన్ని కొనుక్కుని దుకాణాలు నిర్మించుకుని వందలాది కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. ప్రైవేటు స్థలాలపై కార్పొరేషన్ అధికారుల పెత్తనం ఏంటో నాకు అర్థం కావడంలేదు. పైగా దీన్ని లీజు పేరిట కొల్లకొట్టడానికి కుట్ర జరుగుతున్నట్లు మాకు సమాచారం ఉంది.

– ఎంసీ.విజయానందరెడ్డి, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, చిత్తూరు

56 ఏళ్లుగా ఇక్కడే..



పాతబస్టాండ్‌లో 1950వ దశకం నుంచే దుకాణం పెట్టుకొని జీవనం సాగిస్తున్నాం. 1996లో అప్పటి మార్కెట్ విలువ రూ.8.66 లక్షలు చెల్లించి స్థలాన్ని కొనుగోలు చేశాం. మొత్తం ఇక్కడ 54 అంగళ్లు ఉన్నాయి. వీటిపై ఆధారపడి 250 కుటుంబాలకు పైగా బతుకుతున్నాయి. ఈ స్థలం మాది. మాకు ప్రత్యామ్నాయం వద్దు. ఇప్పుడే పాతబస్టాండ్ లోపలకు రానివ్వకుండా అడ్డుగా షీట్లు వేసేశారు. మా కష్టాన్ని గుర్తించి వైఎస్సార్‌సీపీ అండగా నిలిచింది. ఇప్పటికైనా మా జోలికి రాకుండా ఉండాలి.

– దయాళన్, కార్యదర్శి, బస్టాండ్ షాప్ కీపర్స్ అసోసియేషన్

మా కడుపు కొట్టొద్దు



బస్టాండ్‌ను అలాగే ఉంచండి షాపింగ్ కాంప్లెక్స్ పేరిట మా కడుపు కొట్టొద్దు. ఇప్పటికే కే-వియట్ నోటీసులు రెండుసార్లు ఇచ్చారు. దుకాణాలను అధికారులు ఖాళీ చేయిస్తుండడంతో మాకు అప్పులిచ్చిన ఫైనాన్స్ వాళ్లు డబ్బులు మొత్తం ఒకేసారి చెల్లించాలని వేధిస్తున్నారు. దీనికి తోడు కొందరు వ్యాపారులు దుకాణాలు ఖాళీ చేయడానికి ఒప్పుకున్నారంటూ అధికారులు మైండ్‌గేమ్ ఆడిస్తున్నారు. ఎవరికీ ఇక్కడి నుంచి వెళ్లడానికి ఇష్టం లేదు. ఏకపక్షంగా వ్యవహరిస్తే ఆత్మహత్యలే మాకు దారి.

– ఇబ్రహీంఅలీ, వ్యాపారి

నేడు మండల సమావేశం

బంగారుపాళెం: స్థానిక ఎంపీడీఓ సమావేశ భవనంలో శుక్రవారం మండల సర్వసభ సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ శ్రీధర్ గురువారం తెలిపారు. ఉదయం 10.30 గంటలకు ఎంపీపీ అధ్యక్షతన సమావేశం ప్రా రంభం అవుతుందన్నారు. సమావేశానికి ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యులు, కో-ఆప్షన్ సభ్యులు, సర్పంచులు, వివిధ శాఖల మండల స్థాయి అధికారులు, గ్రామ కార్యదర్శులు, వీఆర్‌ఓలు హాజరు కావాలని ఆయన కోరారు.

పోషకాహారంతో ఆరోగ్య ప్రసవం



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ పూర్ణలత

ఐరాల: పోషకాలున్న ఆహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యకర ప్రసవానికి మార్గం సుగమం అవుతుందని స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ పూర్ణలత సూచించారు. మండలంలోని నాగంవాండ్లపల్లెలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో డాక్టర్ 65 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. గ్రామంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంలో గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, చిన్న పిల్లలకు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేశారు. పోషకాహార లోపం వల్ల రక్తహీనత లాంటి సమస్యలు తలెత్తుతాయన్నారు. ఫలితంగా ఆరోగ్యకరమైన బిడ్డకు జన్మనివ్వడం కుదరదన్నారు. తక్కువ ధరకు లభ్యమయ్యే పోషకాలున్నా ఆహారాన్ని తీసుకోవడం ద్వారా ఆరోగ్యకర బిడ్డకు జన్మనివ్వవచ్చన్నారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత తప్పనిసరి



రోడ్డు పనులు పరిశీలిస్తున్న కమిషనర్ నరసింహ ప్రసాద్

చిత్తూరు అర్బన్: నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యత తప్పనిసరిగా ఉండాలని చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ నరసింహ ప్రసాద్ ఆదేశించారు. ఆయన గురువారం పీవీకేఎస్ డిగ్రీ కళాశాల – రిజర్వు ఫారెస్టు రోడ్డు పనులను పరిశీలించారు. రూ.కోటి వ్యయంతో ఇక్కడ జరుగుతున్న బీటీ రోడ్డు విస్తరణ పనులు వేగంగా పూర్తి కావాలని, ఇదే సమయంలో నాణ్యతలో రాజీ ఉండొద్దని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో కమిషనర్ వెంట మునిసిపల్ ఇంజనీరు వెంకటరామిరెడ్డి, ఏఈ లోకేష్ తదితరులు ఉన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి



తెల్లగుండ్లపల్లెలో వృద్ధులకు బీపీ పరీక్షలు చేస్తున్న డాక్టర్ కేశవనారాయణ

తవణంపల్లె: గ్రామాల్లో పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని వైద్యాధికారి డాక్టర్ కేశవనారాయణ తెలిపారు. మండలంలోని తెల్లగుండ్లపల్లెలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ కేశవనారాయణ 30 మంది రోగులకు వైద్య పరీక్షలు చేయించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భవతులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, సుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేయించి సూచనలు, సలహాలిచ్చారు. గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపరచడం వల్ల వ్యాధులు సోకకుండా అరికట్టవచ్చునని సూచించారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించి దోమలను లార్వా దశలోనే నాశనం చేయించాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ శ్రీహరి, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసులు, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కృష్ణాపురంలో..

మండలంలోని కృష్ణాపురంలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ వినయ్‌కుమార్ 42 మంది రోగులకు పరీక్షలు చేయించి సూచనలు, సలహాలిచ్చారు. ఉచితంగా మందులు అందజేశారు. గర్భవతులు, బాలింతలు, బీపీ, సుగర్‌వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేయించి సూచనలు, సలహాలిచ్చారు. గర్భవతుల ఆరోగ్యం గురించి వివరించారు. ఆస్పత్రిలో ప్రసవం తల్లీబిడ్డకు క్షేమమని అన్నారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుబ్రమణ్యం రెడ్డి, ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవం.. వేణుగోపాలుడి దోపోత్సవం



పుష్పాలంకరణలో శ్రీ వేణుగోపాలుడు

వి.కోట: పట్టణంలోని రుక్మిణీ సత్యభామ శ్రీ వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎనిమిదవ రోజైన గురువారం స్వామివారి దోపోత్సవ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో స్వామివారికి అర్చకులు ప్రత్యేక పూజలు,అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఉభయదారులు యల్లప్ప, తనకంటి రమేష్ ఆధ్వర్యంలో స్వామివారిని ఉత్సవమూర్తులుగా కొలువుదీర్చి పట్టణ పురవీధుల్లో ఊరేగించారు. రాత్రి పట్టణ కిరాణా వ్యాపారుల సంఘం ఆధ్వర్యంలో దోపోత్సవ కార్యక్రమం నిర్వహించారు.

మామిడికి తెగుళ్ల తాకిడి

- పూతను ఆశిస్తున్న తామర, తేనెమంచు పురుగు
- దిగుబడులపై ప్రభావం



మామిడితోటలో పూతకొచ్చిన చెట్లు

బంగారుపాళెం: వాతావరణంలో మార్పుల కారణంగా మామిడి తోటలు తెగుళ్ల బారినపడుతున్నాయి. చలి, మంచు తీవ్రత తగ్గి ఉష్ణోగ్రతలు పెరుగుతుండడం మామిడికి ముప్పుగా మారుతోంది. అదే సమయంలో మామిడి తోటలు పూత దశలో ఉండటంతో తామర, తేనె మంచు పురుగు వేగంగా వ్యాపిస్తోంది. పూతలపట్టు నియోజకవర్గంలో దాదాపు 25 వేల హెక్టార్లలో మామిడితోటలు సాగులో ఉన్నాయి. దాదాపు 80 శాతం తోటలు ప్రస్తుతం పూత దశలో ఉన్నాయి. మంచు, చలి తగ్గి ఉష్ణోగ్రతలు పెరుగుతుండడటంతో తెగుళ్ల వ్యాప్తికి అనుకూలంగా మారింది. ముఖ్యంగా మామిడిలో తామర, తేనె మంచు, గొంగళి పురుగుల తాకిడి ఎక్కువగా ఉండడంతో పూత పూర్తిగా దెబ్బతిని దిగుబడి తగ్గిపోయే ప్రమాదం ఉందని మామిడి రైతులు ఆందోళన చెందు తున్నారు.

పెరుగుతున్న పెట్టుబడులు

మామిడి తోటలు పూతదశలో ఉన్న సమయంలో తెగుళ్ల తాకిడి పెరగడంతో నివారణకు పురుగు మందుల వినియోగంతో పెట్టుబడులు కూడా పెరుగుతున్నాయి. తేనె మంచు తెగులు కూడా వేగంగా వ్యాపిస్తుండడంతో దిగుబడిపై ప్రభావం చూపనుంది. కాయ నాణ్యత దెబ్బతినే అవ కాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. పలుమార్లు మందులు పిచికారీ చేసినా తెగు ళ్ల తగ్గడం లేదని రైతులు వాపోతున్నారు. తోటల్లో పూత బాగానే వచ్చినప్పటికీ తెగుళ్ల తాకిడి విపరీతంగా పెరిగిందన్నారు. దాంతో పెట్టుబడులు పెట్టేందుకు జంకుతున్నారు. దిగుబడులు ఆశాజనకంగా లేకపోతే ఈసారి నష్టాలు తప్పవని రైతులు వాపోతున్నారు.



తోటకు మందు పిచికారీ చేస్తున్న కూలీలు

సస్యరక్షణ చర్యలతో తెగుళ్ల నివారణ

మామిడిలో వేగంగా వ్యాపిస్తున్న తామర, తేనెమంచు పురుగు, మసిమంగు తెగుళ్ల నివారణకు సస్యరక్షణ చర్యలు అవసరమని ఉద్యానశాఖ అధికారి సాగరిక తెలిపారు. తోటల్లో ఎండు పుల్లలను తొలగించి చెట్ల పాదులతో పాటు తోట చుట్టూ కలుపు మొక్కలను నివారించాలన్నారు. తామర, గొంగళి, బంక కార్చే పురుగు నివారణకు టపుజ్ 2 మి.లీ, లేదా ఒడీస్ 2 మి.లీ లీటరు నీటితో కలిపి పిచికారి చేయాలని సూచించారు. తేనెమంచు పురుగు నివాకణకు టోకెన్02 మి.లీ లేదా చెస్ 0.3 మి.లీ, లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. పండు ఈగ సమస్య నివారణకు ఎకరాకు ఒక మెర్క్యురీలైట్‌ను ఏర్పాటు చేసుకోవాలని ఆమె సూచించారు.

సురక్షితంగా ప్రయాణించాలి

యాదమరి(కాణిపాకం): డ్రైవింగ్‌లో సురక్షితంగా ప్రయాణించాలని, దూకుడు వద్దని ఆర్టీఓ సునీల్ కుమార్ పేర్కొన్నారు. యాదమరి మండల కేంద్రంలోని ఇండియన్ ఆయిల్ కంపెనీ వద్ద గురువారం జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ డ్రైవర్లు కచ్చితంగా రోడ్డు భద్రతా నియమాలు పాటించాలన్నారు. ప్రధానంగా విశ్రాంతి అవసరమన్నారు. ముందు చూపుతో బండి నడపాలని పదే పదే సూచించారు. కార్యక్రమంలో ఎంవీఐలు రాజేశ్వరరావు, నరసింహులు, ఇండియన్ ఆయిల్ నిర్వాహకులు ఉన్నారు.

వీఆర్‌కు ఎస్ఐ రమేష్‌బాబు

చిత్తూరు అర్బన్: చిత్తూరు తాలూకా ఎస్ఐగా ఎస్‌బీలో పనిచేస్తున్న మల్లికార్జునను బదిలీ చేస్తూ పోలీసుశాఖ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇక్కడ పనిచేస్తున్న రమేష్‌బాబును వీఆర్‌కు పంపింది. మల్లికార్జున రెండు రోజుల్లో బాధ్యతలు తీసుకుంటున్నట్లు వారు పేర్కొన్నారు.

ఎస్‌పీఎంను పరిశీలించిన ఎస్ఈలు



ఎస్‌పీఎంలో అధికారులతో మాట్లాడుతున్న ఎస్ఈలు

చిత్తూరు కార్పొరేషన్: జిల్లా కేంద్రంలోని స్పెషల్ మెయింటెనెన్స్ (ఎస్‌పీఎం)ను గురువారం ట్రాన్స్‌కో చిత్తూరు, తిరుపతి ఎస్ఈలు ఇస్మాయిల్ అహ్మద్, సురేంద్ర నాయుడు కలిసి పరిశీలించారు. అక్కడ కొత్తగా ఏర్పాటు చేసిన ఆయిల్ రీజనరేట్ మిషన్‌ను చూశారు. టెక్నీషియన్లకు చెప్పి త్వరలో వీటిని ఇన్‌స్టాల్ చేయాలన్నారు. వేసవిలోపు వీటి ద్వారా సేవలను అందించాలని ఆదేశించారు. ట్రాన్స్‌ఫార్మర్లను సకాలంలో మరమ్మతు చేసి పంపాలన్నారు. అనంతరం ఉమ్మడి జిల్లా స్టోర్స్‌ను పరిశీలించారు. ప్రస్తుతం నిల్వ ఉన్నవి, కావాల్సిన విద్యుత్ పరికరాలపై మాట్లాడారు. కార్యక్రమంలో ఈఈలు జగదీష్, వాసుదేవరెడ్డి, డీఈలు రవి, వసంతనాయుడు, ఏఈలు మోహన్‌శెట్టి, మోహనరావు, వివేకానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పొగమంచులో లైట్ వేసుకుని వెళుతున్న వాహనదారులు

కమ్మేసిన పొగమంచు

పాలసముద్రం : మండలాన్ని గురువారం పొగమంచు కమ్మేసింది. ఉదయం 8.30 గంటలైనా మంచు వీడలేదు. చలికి ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రాలేదు. రోడ్డుపై వాహనాలు నడిపేవారు లైట్లు వేసుకుని వెళ్లాల్సి వచ్చింది. ఈ మంచుకు మిరప, మామిడి పూత రాలిపోతుందని రైతులు వాపోతున్నారు. వరి, వేరుశనగ పంటలకు చీడపీడలు ఎక్కువగా ఆశిస్తున్నాయని చెబుతున్నారు.



ఉదయం 9 గంటలైనా వీడని మంచు